

ఐపీఎల్ సందడి

హోరెత్తిపోయిన చెపాక్ మైదానం



పెరంబూర్, మార్చి 22: ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)17వ సీజన్ టీ20 పోటీలు శుక్రవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. స్థానిక చేపాక్కంలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో సాయంత్రం 6.30 గంటలకు పోటీల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. అభిమానుల కేకలు, ఈలలతో చేపాక్కం మైదానం మార్మోగింది.

ఆకట్టుకున్న లేజర్ షో...

ప్రారంభోత్సవంలో లేజర్ షో అభిమానులను ఉర్రూతలూగించింది. సంగీత విభాగం, నృత్యంలో మధ్యలో భారీ జాతీయ పతాకం ఎగిరే దృశ్యం, ఇండియా గేట్ నమూనా, చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ ల్యాండ్ అయ్యే సన్నివేశాలతో రూపొందించిన లేజర్ షో విశేషంగా ఆకట్టుకుంది.

ఉర్రూతలూగించిన అక్షయ్,టైగర్ ష్రాఫ్

ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభోత్సవం సందర్భంగా బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ నృత్యాలతో అభిమానులు ఊగిపోయారు. తొలుత అక్షయ్‌కుమార్ జాతీయ పతాకం చేతబట్టి తాళ్ల సాయంతో పై నుంచి వేదిక పైకి చేరుకున్నారు. అనంతరం పలు హిందీ, తమిళ సినిమా పాటలకు డాన్సర్స్‌తో కలసి వారు చేసిన నృత్యాలకు అభిమానులు కేరింతలు కొట్టారు. మధ్యలో అక్షయ్ కుమార్ బైకు నడుపుతుండగా టైగర్ ష్రాఫ్ జాతీయ పతాకం చేతబూని స్టేడియం చుట్టూ తిరుగుతూ అభిమానులను ఆనందపరిచారు.



జాతీయ పతాకంతో బైక్‌పై అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్

అలరించిన రెహ్మాన్ సంగీత విభావరి...



సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహ్మాన్ సంగీత విభావరి అభిమానులను అలరించింది. ప్రముఖ నేపథ్యగాయనీ, గాయకులతో కలసి రెహ్మాన్ 'వందే మాతరం....', 'జయహో...' అనే ఆల్బమ్‌లోని పాటలు సహా తమిళం, హిందీ సినీ గీతాలు ఆలపించారు. ఈ పాటలకు డాన్సర్స్ వేసిన స్టెప్పులకు అనుగుణంగా రెహ్మాన్, నేపథ్యగాయకులు కూడా డాన్స్ చేశారు.



తరలివచ్చిన అభిమానులు...



అభిమానుల కోలాహలం

ఐపీఎల్ పోటీల్లో భాగంగా తొలి మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మధ్య రాత్రి 8 గంటలకు ప్రారంభమైంది. ఈ పోటీలకు సంబంధించిన ఆన్‌లైన్ టిక్కెట్ల విక్రయాలు హాట్‌కేకుల్లా 10 నిమిషాల్లోనే విక్రయమయ్యాయి. టిక్కెట్లు పొందిన అభిమానులు, స్పాన్సర్ సంస్థలు అందజేసిన టిక్కెట్లతో అభిమానులు మధ్యాహ్నం 3 గంటల నుంచే స్టేడియానికి చేరుకున్నారు. తమ జట్ల పేర్లను చెంపలపై ముద్రించుకొనేందుకు అభిమానులు పోటీపడ్డారు. ఇక, పొరుగు రాష్ట్రాలకు చెందిన అభిమానులు గురువారం రాత్రే చెన్నైకి చేరుకున్నారు. ఈ పోటీలు వీక్షించేందుకు వచ్చిన విదేశీ అభిమానులు స్థానిక మెరీనా తీరంలోని దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి స్మారక మందిరాలను సందర్శించారు. ఆ ప్రాంతాలో సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు.

బాణసంచా వెలుగుల్లో మైదానం...

కార్యక్రమంలో భాగంగా బాణసంచా వెలుగుల్లో చేపాక్కం మైదానం మిరుమిట్లుగొలుపుతూ దర్శనమిచ్చింది. కార్యక్రమం ప్రారంభం, మధ్యలోను, చివర్లలోను స్టేడియం పైభాగం, మైదానం చుట్టుపక్కల నుంచి రంగు రంగు వెలుగులతో కాల్చిన బాణాసంచా అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. పేలుళ్లకు అనుగుణంగా డీజే పాటలు జోడుకావడంతో అభిమానుల్లో మరింత జోష్ వచ్చింది.

కమనీయం...
కపాలేశ్వరుడి రథోత్సవం

● నేడు ఆరపత్తుమూవర్ విళా



రథోత్సవం - రథం ముందు సంప్రదాయ వాద్యం (ఇన్‌సెట్‌లో)

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం మైలాపూరు కపాలేశ్వరాలయ మహారథోత్సవం శుక్రవారం ఉదయం కనులపండువగా జరిగింది. ఆలయంలో యేటా పంగుణి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈనెల 16న ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ కర్పగాంబాళ్ సమేత కపాలేశ్వరస్వామి వివిధ వాహనాల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైంది. ఈ ఉత్సవం సందర్భంగా వేకువజామునే ఆలయాన్ని తెరచి స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. స్వర్ణ, వజ్రాభరణాలను ధరింపజేశారు. మంగళవాయిద్యాల నడుమ సర్వాలంకరణ శోభితులైన కర్పగాంబాళ్ సమేత కపాలేశ్వరుడు పల్లకీపై ఆలయ ప్రాంగణంలో ఊరేగించి రథ మండపానికి తీసుకొచ్చారు. ఆ సందర్భంగా మహాదీపారాధన కావించి స్వామి, అమ్మవారిని రథంపై సిద్ధం చేసిన ప్రత్యేక పీఠంపై ఆశీనులు గావించారు. ఆ తర్వాత రథ మండపం నుంచి మహారథం బయలుదేరింది. రథానికి ఇరువైపులా మోకుతాళ్లను పట్టుకుని భక్తులు లాగారు. రథోత్సవం సందర్భంగా మాడవీధుల్లో స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారుల సంఘాలు అన్నదానం చేశారు. పలుచోట్ల చల్లటి మజ్జిగ, పానకాలను పంపిణీ చేశారు. ఈ రథోత్సవం సందర్భంగా ఆర్కే మఠం రోడ్డు వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు, ఆలయ నిర్వాహకులు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు.

పంగుణి ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం కపాలేశ్వరాలయంలో 63 మంది నాయన్మార్ల ఉత్సవం జరగనుంది. దేశంలో ఈ ఆలయంలోనే ఒకే సమయంలో 63 మంది నాయన్మార్లకు ఉత్సవం నిర్వహిస్తారు. ప్రాచీన కాలం నుండి ఆరుపత్తుమూవర్ విళా ఈ శైవక్షేత్రంలో జరిగినట్లు చారిత్రక ఆధారాలు కూడా ఉన్నాయి. ఒకే సమయంలో 63 మంది నాయన్మార్ల విగ్రహాలను పల్లకీలలో ఊరేగించడం ఈ ఉత్సవం ప్రత్యేకత. పంగుణి ఉత్సవాల్లో ఈ ఆరుపత్తు మూవర్ విళాకే సుమారు లక్షమందిదాకా భక్తులు హాజరవుతుంటారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు గ్రామదేవత కోలవిళియమ్మన్ ఉత్సవమూర్తిని, వినాయకుడి ఉత్సవమూర్తిని తొలుత ఊరేగించనున్నారు. ఆ తర్వాత 63 మంది నాయన్మార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పల్లకీల్లో ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించనున్నారు. ఈ వేడుకల్లో మైలాపూరులోని అన్ని కూడళ్ల వద్ద భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం పంపిణీ చేస్తారు. అదే విధంగా భక్తులకోసం పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసి చల్లటి మజ్జిగ, పానకం, కొబ్బరినీళ్లను అందించనున్నారు. మైలాపూరు ప్రాంతంలోని వాణిజ్య సంస్థలన్నీ కలిసి ఈ అన్నదాన కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహిస్తారు.

రంజాన్ వేళలు

శనివారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.26
ఆదివారం : సహర్ : ఉదయం -4.31



ఓడిపోతామనే భయంతో మోదీకి కునుకుపట్టడం లేదు

● తిరుచ్చి సభలో సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో నరేంద్రమోదీకి ప్రస్తుతం కంటిమీద కునుకు రాకుండా అవస్థలు పడుతున్నారని, ఆ భయం వల్లే రాష్ట్రానికి పదేపదే ప్రచారానికి వస్తున్నారని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎద్దేవా చేశారు. తిరుచ్చిలో శుక్రవారం సాయంత్రం డీఎంకే కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటైన బహిరంగ సభలో ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఎన్నికల సమయంలోనే ప్రధానికి తమిళనాట పర్యటించాలనే తలంపు కలుగుతుందన్నారు. వరదలు, వర్షబీభత్సాలు సంభవిస్తే కనీసం కన్నెత్తి కూడా చూడరని, బాధితులను పరామర్శిస్తూ ప్రకటనలు కూడా చేయరని విమర్శించారు. మోదీ ఎన్నిసార్లు రాష్ట్రంలో పర్యటించినా ప్రచారం చేసినా బీజేపీ కూటమికి ఓట్లు రాలవన్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో విజయ దుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మూడేళ్లపాటు డీఎంకే ద్రావిడ తరహా పాలనలో ప్రజలకు అమలు చేసిన పథకాలే తమ కూటమిని గెలిపిస్తాయన్నారు. దేశ ప్రజలంతా మెచ్చుకునే రీతిలో తమ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, గృహిణులకు కలైంజర్ సాధికారిక నగదు పంపిణీ పథకం, విద్యార్థినులు ఉన్నత విద్యాకోర్సులు చదివేందుకు ప్రతినెలా రూ.1000 చెల్లింపు, బడిపిల్లలకు అల్పాహార పథకం, సిటీ బస్సుల్లో మహిళల వెలుగుబాట ప్రయాణం, ప్రజల వద్దకే వైద్యం, విద్య వంటి పథకాలతో ప్రజల నుంచి అభినందనలు అందుకుంటున్నామని చెప్పారు. తాను పర్యటించే అన్ని ప్రాంతాల్లో మంచి పథకాలు అమలు చేశారంటూ ప్రసంసిస్తున్నారని పేర్కొన్నారు. తిరుచ్చిలో ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా పార్టీకి విజయమేనని, ఆ దిశలో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభను తిరుచ్చిలోనే శ్రీకారం చుట్టడంతో డీఎంకే కూటమి 40 చోట్ల గెలుపొందుతుందని అన్నారు.



తిరుచ్చి సభలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

మంత్రిగా పొన్ముడి ప్రమాణస్వీకారం

● సుప్రీంకోర్టు ఉత్తర్వులకు తలొగ్గిన గవర్నర్



పొన్ముడిచే మంత్రిగా ప్రమాణస్వీకారం చేయిస్తున్న గవర్నర్ రవి

ప్యారీస్, మార్చి 22: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మూడేళ్ల శిక్ష పడి సుప్రీంకోర్టులో ఊరట పొందిన డీఎంకే ఎమ్మెల్యే కె.పొన్ముడితో మంత్రిగా ప్రమాణం చేయించేందుకు నిరాకరించిన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ఎట్టకేలకు సుప్రీం ఆదేశాలతో తలొగ్గారు. ఎట్టకేలకు రాజ్‌భవన్‌లో శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిగా వ్యవహరించిన పొన్ముడి, ఆదాయానికి మించి ఆస్తులు వెనకేసుకున్నారనే కేసుపై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు ఆయనకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అదే విధంగా ఆయన భార్య విశాలాక్షికి కూడా ఆ స్థాయిలోనే శిక్ష విధించింది. ప్రజా ప్రతినిధుల చట్టం ప్రకారం రెండేళ్ల శిక్ష పొందితే అనర్హత వేటు పడడం ఆనవాయితీ. ఆ మేరకు గత ఏడాది డిసెంబరు 19వ తేది నుంచి విల్లుపురం జిల్లా తిరుకోవిలూరు ఎమ్మెల్యే పదవిని పొన్ముడి కోల్పోయారు. దీంతో ఆ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయినట్లు మార్చి 5న అధికారపూర్వక ప్రకటన విడుదలైంది. ఎమ్మెల్యే, మంత్రి పదవులు కోల్పోయిన పొన్ముడి, చట్టపరమైన చర్యలు చేపట్టారు. మద్రాసు హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం, హైకోర్టు ఆయనకు విధించిన శిక్ష ను నిలుపుదల చేస్తూ ఈనెల 11న ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులతో మార్చి 5న అసెంబ్లీ కార్యదర్శి విడుదల చేసిన ప్రకటన ఉపసంహరించుకుంటున్నట్లు ఈనెల 11న ప్రకటించారు. అందువల్ల పొన్ముడి మళ్లీ ఎమ్మెల్యే కావడంతో ఆయనతో మంత్రి గా ప్రమాణస్వీకారం చేయించాలని కోరుతూ సీఎం ఎంకే స్టాలిన్ గవర్నర్ రవికి లేఖ రాశారు. రాష్ట్రప్రభుత్వ కోరికను గవర్నర్ నిరాకరించారు. దీంతో పాటు గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా ఉల్లంఘించారని, పొన్ముడితో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించాల్సిందిగా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గురువారం విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం, గవర్నర్ తీరును ఎండగడుతూ ఆయన వైఖరిని తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడకుండా రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదన మేరకు పొన్ముడితో శుక్రవారం లోపు ప్రమాణ స్వీకారం చేయించాలని అత్యున్నత న్యాయస్థానం మందలింపు ధోరణిలో గవర్నర్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గవర్నర్ తన పదవికి రాజీనామా చేస్తారని రాజకీయపార్టీలతో పాటు ప్రజలు కూడా గురువారం రాత్రి ఎదురుచూశారు. అయితే అనూహ్యంగా సుప్రీం ఉత్తర్వులకు తలొగ్గిన గవర్నర్... పొన్ముడితో ప్రమాణస్వీకారం చేయించారు. గిండీలోని రాజ్‌భవన్ దర్బార్ హాలులో మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన కార్యక్రమంలో సీఎం స్టాలిన్, మంత్రులు పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వ సిఫారసు మేరకు పొన్ముడికి మళ్లీ ఉన్నత విద్యాశాఖను అప్పగించారు. సీఎం స్టాలిన్ గవర్నర్‌కు, మంత్రి పొన్ముడికి పుష్పగుచ్ఛం సమర్పించగా, గవర్నర్ కూడా వారిని రాజ్‌భవన్ తరపున సత్కారం అందించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సుప్రీంకోర్టు : సీఎం

సుప్రీంకోర్టు సరైన సమయంలో జోక్యం చేసుకొని గవర్నర్‌ను మందలించి, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ ధర్మాసనాన్ని కాపాడిందంటూ సీఎం ఎంకే స్టాలిన్ తన ఎక్స్ పేజీలో సందేశం పొందుపరిచారు. పొన్ముడితో ప్రమాణస్వీకారం చేయించడానికి నిరాకరించిన గవర్నర్‌ను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించడంతో పాటు ఒకరోజు గడువిచ్చి నిర్ణయం తీసుకోమంటూ హెచ్చరించడం అభినందనీయమన్నారు.

గృహిణులకు ప్రతినెలా రూ.3000

● ఏడాదికి 6 ఉచిత సిలిండర్లు ● నీట్‌కు ప్రత్యామ్నాయ పరీక్ష
● శ్రీలంక శరణార్థులకు ద్వంద్వ పౌరసత్వం
● అన్నాడీఎంకే మేనిఫెస్టోలో హామీల జల్లు

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికార డీఎంకేకు ఏమాత్రం తీసిపోని రీతిలో ప్రతిపక్ష అన్నాడీఎంకే కూడా హామీల జల్లు కురిపించింది. ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నిరుపేద గృహిణులందరికీ ప్రతినెలా రూ.3వేలు చెల్లింపు, నీట్‌కు బదులుగా ప్రత్యామ్నాయ పరీక్ష , శ్రీలంక శరణార్థులకు ద్వంద్వ పౌరసత్వం... ఇలా కీలకమైన హామీలను మేనిఫెస్టోలో చేర్చింది. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయమైన ఎంజీఆర్ మాళిగైలో ఏర్పాటైన ప్రత్యేక సభలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డి.జయకుమార్, కే.పీ.మునుసామి, నత్తం విశ్వనాథన్, తమిళ్‌మగన్ హుస్సేన్, సి.పొన్నయ్యన్, సెల్లూరు రాజు, గోకుల ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలోని ముఖ్యమైన హామీలు...

1. ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్ల పంపిణీ 2. నిరుపేద గృహిణులందరికీ ప్రతి నెలా రూ.3 వేలు 3.నీట్‌కు బదులుగా ప్రత్యామ్నాయ పరీక్ష నిర్వహణ 4. శ్రీలంక శరణార్థులు ద్వంద్వ పౌరసత్వం కల్పన 5. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాల మేరకే గవర్నర్ల నియామకం 6. చెన్నైలో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఏర్పాటు 7. చెన్నైలో పార్లమెంట్ శీతాకాలపు సమావేశాల నిర్వహణ 8. మద్రాసు హైకోర్టులో అధికార భాషగా తమిళం 9. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కూలీ రూ.450కు పెంపు 10. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు భారీగా నిధుల కేటాయింపు 11. కేంద్రం నుంచి అన్ని రాష్ట్రాలకు సమానంగా నిధుల కేటాయింపు 12. నిలిపివేసిన రైల్వే ప్రయాణ రాయితీల అమలు 13. ముల్లై పెరియార్ వివాదానికి శాశ్వత పరిష్కారం 14. పాలారుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆనకట్ట నిర్మించకుండా న్యాయపరమైన చర్యలు 15. కావేరి నదిపై మెకెదాటు ఆనకట్ట నిర్మాణానికి అడ్డుకట్ట 16. కావేరి - గోదావరి నదుల అనుసంధాన పథకం యుద్ధ ప్రాతిపదికన అమలు 17. కావేరి డెల్టా సాగునీటి కాల్వలకు సిమెంట్ పూత 18. దేశవ్యాప్తంగా వాననీటి సేకరణ పథకం అమలు 19. కచ్చాదీవి విముక్తి కోసం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ త్వరగా పూర్తి 20. సామాన్యులకు అందుబాటులో ప్రాణ రక్షణ మందుల ధరలు 21. విదేశీ తమిళులకు అన్ని సదుపాయాలు 22. దేశమంతటా ప్లాసిక్ వస్తువుల వాడకంపై నిషేధం 23. రైతులకు ప్రత్యేక పింఛను పథకం 24. జాతీయ రహదారులలోని టోల్‌గేట్లన్నీ తొలగింపు 25. రాష్ట్రంలో మరిన్ని నగరాలలో మెట్రో రైలు పథకం అమలు 26. జాలర్లకు ఉచిత పక్కా గృహాలు.



మేనిఫెస్టో విడుదల చేస్తున్న అన్నాడీఎంకే నేతలు

సమాచార దర్శిని

నేటినుంచి పళనికి ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, మార్చి 22: పంగుణి ఉత్తిరై ఉత్సవాలను పురస్కరించుకొని పళనికి ఈనెల 23న శనివారం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ అధికారులు తెలిపారు. దిండుగల్, మదురై, తిరుచ్చి, కారైక్కుడి, కోయంబత్తూర్, తిరుప్పూర్‌ల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పళనికి వెళ్లడాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నెల23 నుంచి 26వ తేది వరకు ప్రత్యేక బస్సులు, అదనపు సర్వీసులు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

27న అయ్యప్ప ఆలయ కుంభాభిషేకం

ఐసిఎఫ్, మార్చి 22: స్థానిక రాజా అన్నామలైపురం అయ్యప్పస్వామి ఆలయ మహా కుంభాభిషేకం ఈ నెల 27వ తేది జరగనుంది. ఈ ఆలయంలో వినాయకుడు, నవగ్రహ సన్నిధి, ఆంజనేయస్వామికి గోపురాలు నిర్మించారు. వీటికి మహాకుంభాభిషేకం ఉదయం 10.40 గంటలకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 7 గంటలకు యాగశాల పూజ జరుగనుంది. కుంభాభిషేకాన్ని శబరిమల బ్రహ్మశ్రీ గండరరు మోహన్ తంత్రి, పిళ్లయార్‌పట్టి ప్రధాన గురువులు శివశ్రీ, పిచ్చైగురుక్కల్ నిర్వహించనున్నారు.

31న పనిచేయనున్న బ్యాంక్‌లు

ఐసిఎఫ్, మార్చి 22: బ్యాంకులు ఈనెల 31వ తేది పనిచేయనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు ఆదివారం సెలవు దినం. ఈ ఆర్థిక సంవత్సరం చివరి రోజైన 31వ తేది ఆదివారం వస్తోంది. ఆ రోజు అన్ని బ్యాంకులకు పనిదినంగా ప్రకటిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, ఆరోజు అన్ని బ్యాంకులు యథావిధిగా పనిచేయనున్నాయి.

8 జిల్లాల్లో కార్చిచ్చు

ఐసిఎఫ్, మార్చి 22: రాష్ట్రంలో 8 జిల్లాల్లో కార్చిచ్చు ఏర్పడినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. నీలగిరి, కొడైకెనాల్ వంటి ప్రాంతాల్లో గత కొన్ని వారాలుగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, గురువారం ఒకేరోజు దిండుగల్, కన్నియాకుమారిలో 24 ప్రాంతాల్లో, తిరువణ్ణామలైలో 51, ఈరోడ్, సేలంలో తలా 2, నీలగిరి, తేని, వేలూరుల్లో కార్చిచ్చు ఏర్పడిందని, అగ్నిమాపక శాఖ సిబ్బందితో మంటలు ఆర్పే చర్యలు చేపట్టామని అధికారులు తెలిపారు.

24నుంచి పోలింగ్ బూత్ ఉద్యోగులకు తొలివిడత శిక్షణ

ఐసిఎఫ్, మార్చి 22: పోలింగ్ బూత్ ఉద్యోగులకు తొలివిడత శిక్షణ తరగతులు ఈ నెల 24వ తేది ఉదయం 9 గంటల నుంచి 16 కేంద్రాల్లో జరగనున్నాయి. ఏప్రిల్ 19వ తేది లోక్‌సభ ఎన్నికలు జరుగనుండగా, నగరంలో ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై, మధ్య చెన్నై లోక్‌సభ నియోజకవర్గాల్లో 3,726 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో పని చేయనున్న ఉద్యోగులకు ఆదివారం ఉదయం ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ తరగతుల్లో పాల్గొనని ఉద్యోగులపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జె.రాధాకృష్ణన్ తెలిపారు.

సీఎంఆర్‌ఎల్‌లో ఉద్యోగావకాశాలు

ఐసిఎఫ్, మార్చి 22: చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్)లో ఉద్యోగాలకు ఏప్రిల్ 24వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఏజీఎం, జేజీఎం, మేనేజర్, డీఎం, ఏఎం తదితర పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఔత్సాహికులు సీఎంఆర్‌ఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు కెరీర్, చెన్నై మెట్రోరైల్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

శ్రీలంక జైలు నుంచి 19మంది జాలర్ల విడుదల

పెరంబూర్, మార్చి 22: సరిహద్దులు దాటి చేపల వేట సాగిస్తున్నారంటూ శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన పుదుకోట, నాగపట్టణానికి చెందిన 22 మంది జాలర్లలో 19 మంది విడుదలయ్యారు. వారిలో ముగ్గురు ఫైబర్ బోట్ల డ్రైవర్లకు ఆరు నెలల జైలుశిక్షను ఆ దేశ న్యాయస్థానం విధించింది. విడుదలైన జాలర్లు మరో రెండు రోజుల్లో రాష్ట్రానికి చేరుకుంటారని, శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకున్న పడవల విచారణ జూన్ 7వ తేది జరుగుతుందని సమాచారం అందినట్లు రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

రేపు మట్టల ఆదివారం

● ప్రత్యేక ప్రార్థనలకు చర్చిల ముస్తాబు

ప్యారీస్, మార్చి 22: లోక రక్షకుడు ఏసుక్రీస్తు 40 రోజులు ఉపవాసంతో ప్రార్థనల్లో పాల్గొన్న కాలాన్ని ఉపవాస దీక్షగా క్రైస్తవులు పాటిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 24వ తేది మట్టల ఆదివారం జరుపుకొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చర్చీలన్నీ ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. నాగపట్టినం జిల్లాలో ప్రసిద్ధిచెందిన వేలాంకన్ని, తిరుత్తురైపూండి మేరీమాత ఆలయం, చెన్నై బీసెంట్ నగర్ వేలాంకన్ని చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథడ్రల్ చర్చి సహా మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి, పెరంబూర్‌లోని వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఆవడి బజార్ నగర్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఇశ్రాయేలుపేట తెలుగు బాప్టిస్ట్ చర్చి, పెరంబూర్ జీసస్ మిరాకిల్ చర్చి, అంబత్తూర్ మన్నూర్‌పేట ఇమ్మానుయేలు క్రైస్తవ సంఘం, విల్లివాక్కం జీసస్ క్రైస్ట్ గ్రేస్ హోప్ చర్చీల ఆధ్వర్యంలో మట్టలతో ఊరేగింపు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు చర్చీల నిర్వాహకులు తెలిపారు.

నీలగిరి, కోవైలో ప్రధాని మోదీ ప్రచారం

ప్యారీస్, మార్చి 22: ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ కూటమి తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మిత్రపక్షాలకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనేందుకు మరో నాలుగు సార్లు రాష్ట్రంలో పర్యటించనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పోటీ చేయనున్న కోయంబత్తూర్, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ పోటీ చేయనున్న నీలగిరి నియోజకవర్గాల్లో ప్రధానితో పాటు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా సహా 18 మంత్రి కేంద్ర మంత్రులు ప్రచారంలో పాల్గొంటారని కమలాలయం పేర్కొంది. మాజీ గవర్నర్ తమిళిసైకు మద్దతుగా దక్షిణ చెన్నై సహా వేలూరు, పెరంబలూరు తదితర నియోజకవర్గాల్లో కూడా కేంద్రమంత్రులు మూడు రోజులు మకాం వేసి ప్రచారంలో పాల్గొంటారు.

కేఎండీకే నామక్కల్ అభ్యర్థి మార్పు

ప్యారీస్, మార్చి 22: డీఎంకే కూటమిలో నామక్కల్ లోక్‌సభ స్థానంలో కొంగునాడు మక్కల్ దేశీయ మక్కల్ కట్చి (కేఎండీకే) అభ్యర్థి సూర్యమూర్తిని మార్పు చేశారు. ఆయనకు బదులుగా మాదేశ్వరన్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, డీపీఐ, ఎండీఎంకే, ఐయూఎంఎల్, కేఎండీకే తదితర పార్టీలకు నియోజకవర్గాల కేటాయింపు, అభ్యర్థుల ఎంపిక ముగిసింది. కాగా, సూర్యమూర్తికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన కథనాలు పార్టీ అధిష్ఠానాన్ని కలవరపెట్టాయి. దీంతో, ఆయనను మార్చి మాదేశ్వరన్ పోటీ చేస్తారని, నామక్కల్‌కు చెందిన మిత్రపార్టీల నిర్వాహకులు ఆయనను గెలిపించేలా కృషి చేయాలని పార్టీ అధిష్ఠానం విజ్ఞప్తి చేసింది.

నాట్యం, సంగీతం భగవంతుడి కృప

● నాట్యభూషణ జగదీష్ చల్లా

ప్యారీస్, మార్చి 22: నాట్యం, సంగీతం భగవంతుడి కృప అని తిరుమల తిరుపతి దేవస్థానం నాట్య కళాకారుడు జగదీష్ చల్లా పేర్కొన్నారు. స్థానిక షావుకారుపేటలోని రంగనాయకి సమేత రంగనాథస్వామి ఆలయ ట్రస్టీ ఇమ్మిడి కిషోర్ పర్యవేక్షణలో చిత్తూరు జిల్లా దేవళంపేటలో ఉన్న కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ గణపతి, కన్యకా పరమేశ్వరి, షిర్డీ సాయిబాబా ఆలయాల జీర్ణోద్ధారణ, అష్ట బంధన మహా సంప్రోక్షణ వైభవం ఈనెల 27న జరగనుంది. ఈ ఆలయంలో ప్రతిష్ఠించే ఉత్సవమూర్తులకు రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం వ్యాసర్పాడి సమీపంలోని ఎంకేబీనగర్‌లో ఉన్న నార్త్ మద్రాస్ ఆర్యవైశ్య సంఘ ప్రాంగణంలో కోలాహలంగా జరిగింది. నిర్వాహకులు వి.రామకృష్ణ, చీమకుర్తి గోవిందరాజులు, మద్దాల ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్, లయన్ డీవీ రవీంద్రన్, శ్యామల, గుమ్మిడిపూండి ఆనంద్ చెట్టి తదితరులు ఉత్సవమూర్తుల విగ్రహాలకు అలంకరణ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నాతా పద్మలత వీణ కచ్చేరి, జగదీష్ చల్లా భరత నాట్యం అలరించింది.



సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి పిలుపునిచ్చారు. 100 శాతం ఓటింగ్ నమోదయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించే చర్యల్లో భాగంగా శుక్రవారం బస్టాండ్‌లోని ప్రభుత్వ బస్సులపై కలెక్టర్ స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఓటింగ్ నమోదు అవగాహన చర్యల్లో భాగంగా డివిజన్ స్థాయిలో ఓట్ల ప్రతిజ్ఞ, ముగ్గుల పోటీలు, కబడ్డీ, తాడులాగే పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, మహిళ పథక డైరెక్టర్ నాగరాజన్ సహా మహిళా స్వయం సహాయక బృందాలు, ప్రజలు పాల్గొన్నారు.



గ్రామీణాభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తి, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్

వీఐటీ ఛాన్సలర్‌తో ఏసీ షణ్ముగం భేటీ



విశ్వనాథన్, సెల్వంను సన్మానిస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, మార్చి 22: వేలూరు లోక్‌సభ స్థానం నుంచి ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పుదియ నీతి పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం పోటీ చేస్తున్నారు. ఆయన శుక్రవారం వీఐటీ చాన్సలర్, మాజీ పార్లమెంటు సభ్యుడు విశ్వనాథన్, వర్సిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వంతో భేటీ అయ్యారు. అనంతరం వారిని సన్మానించారు.

ప్రాథమిక చికిత్సపై కర్ణాటక జైలు సిబ్బందికి శిక్షణ

వేలూరు, మార్చి 22: స్థానిక తొరప్పాడిలో ఉన్న శిక్షణ కేంద్రంలో కర్ణాటక రాష్ట్ర జైలు అధికారులకు శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేలూరు డివిజన్ జైళ్ల శాఖ ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి తరగతులు ప్రారంభించగా, ఆప్కా డైరెక్టర్ ప్రదీప్ అధ్యక్షత వహించారు. ఈ తరగతుల్లో తమిళనాడు మాజీ ఖైదీల సంక్షేమ సంఘం తరఫున, జైళ్లలోని ఖైదీలు అనారోగ్యానికి గురైన సమయంలో అందించాల్సిన ప్రాథమిక చికిత్సలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు, న్యాయవాది విజయరాఘవులు, సెక్రటరీ జనార్ధనన్, కోశాధికారి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



తరగతుల్లో ప్రసంగిస్తున్న జనార్దనన్

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్యారీస్, మార్చి 22: స్థానిక పట్టాభిరాంలో ఉన్న ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ శెట్టి హిందూ కాలేజీలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నగరంలోని ప్రాంతీయ డీఎంఐ వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయ సలహాదారు డాక్టర్ గోవిందరెడ్డి, విశిష్ట అతిథిగా డైరెక్టరేట్ ఆఫ్ మార్కెటింగ్ అండ్ మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ రీజనల్ ఆఫీసర్ సంతోష్ పాల్గొని వినియోగదారుల హక్కులకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రసంగించారు. కళాశాల ప్రధాన అధ్యాపకురాలు జి.కల్విక్కరసి, తమిళనాడు స్టేట్ సొసైటీ ఫర్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ ఎంపవర్‌మెంట్ సభ్యుడు శఠగోపన్, తమిళనాడు ప్రోగ్రెసివ్ సెంటర్ ప్రధాన కార్యదర్శి జయకుమార్ సహా పలువురు ప్రముఖులను ఈ కార్యక్రమంలో సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ముందు కన్స్యూమర్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ రూపిణి స్వాగతోపన్యాసం చేశారు. సిటిజన్ కన్స్యూమర్ క్లబ్, తమిళనాడు ప్రోగ్రెసివ్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



విశిష్ట అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

టీఎంసీ అభ్యర్థులకు జీకే వాసన్ ఆశీస్సులు



జీకే వాసన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణుగోపాల్, విజయ్‌కుమార్

పెరంబూర్, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి తరఫున తమిళ మానిల కాంగ్రెస్ మూడు నియోజకవర్గాల్లో పోటీ చేస్తోంది. కూటమిలో భాగంగా టీఎంసీకి కేటాయించిన శ్రీపెరుంబుదూర్ నుంచి వేణుగోపాల్, ఈరోడ్ నుంచి విజయకుమార్ పోటీచేస్తున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్‌ను కలుసుకున్న వేణుగోపాల్, విజయకుమార్ తమను అభ్యర్థులుగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు విడియల్ శేఖర్, రాజమ్ ఎంపీ నాథన్, మున్వర్ బాషా, ప్రధాన కార్యాలయ కార్యదర్శి జీఆర్ వెంకటేశ్, జిల్లా అధ్యక్షులు సైదై మనోహరన్, బిజూ చాకో తదితరులు అభ్యర్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

● అయ్యా... నేను డీఎంకే అభిమానిని కానీ పింఛన్ లేదు

పెరంబూర్, మార్చి 22: కాంచీపురం లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సెల్వం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. పరందూర్‌లో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టి ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆ సమయంలో 86 ఏళ్ల ఓ వృద్ధుడు... తాను ఇప్పటివరకు డీఎంకేకే ఓటు వేశానని, కానీ, ఇప్పటివరకు తనకు వృద్ధాప్య పింఛన్ అందలేదని వాపోయారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే, వృద్ధాప్య పింఛన్ అందిస్తానంటూ హామీ ఇచ్చిన డీఎంకే అభ్యర్థి సెల్వం తన ప్రచారాన్ని కొనసాగించారు.



పింఛన్ అందించాలని డీఎంకే అభ్యర్థి సెల్వంకు కోరుతున్న వృద్ధుడు

వికీ ఇండస్ట్రీస్ నుంచి ఐస్టీల్ జింక్ కోటెడ్ ఇనుప కమ్మీలు

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలో ప్రీమియం టీఎంటీ బార్లకు పర్యాయపదంగా ఉన్న ఐస్టీల్ బ్రాండ్‌ను మార్కెటింగ్ చేస్తున్న వికీ ఇండస్ట్రీస్ సాధారణ టీఎంటీ ఇనుమ కమ్మీల కంటే మూడురెట్లు ఎక్కువ మన్నికగా పటిష్ఠంగా ఉండే 'ఐస్టీల్ జింక్ కోటెడ్ బార్ల'ను (ఇనుప కమ్మీలను) మార్కెట్లో ప్రవేశపెట్టింది. నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో వికీ ఇండస్ట్రీస్ సీఈఓ జి. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ అధునాతన గాల్వనైజింగ్ టెక్నాలజీతో తయారు చేసిన ఐస్టీల్ జింక్ బార్లు సముద్రతీరాలు, పారిశ్రామికవాడలకు సమీపంలోని ప్రాంతాల్లో జింక్ కోటెడ్ బార్లతో నిర్మించిన కట్టడాలు పటిష్ఠంగా ఉంటాయని వివరించారు. ప్రొఫెసర్ ఏఆర్ శాంతకుమార్, ఐస్టీల్ క్వాలిటీ కంట్రోల్ హెడ్ టీవీ సుబ్రమణ్యం, ఇండియా లెడ్ జింక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్ పుగళేంది తదితరులు పాల్గొన్నారు.




కొత్తరకం జింక్ కోటెడ్ బార్లను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

వైభవంగా మార్గబంధీశ్వరుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేలూరు, మార్చి 22: విరింజిపురంలో ప్రసిద్ధిచెందిన మార్గబంధీశ్వరుడి ఆలయ పంగుణి నెల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రథోత్సవం కోలాహలంగా సాగింది. తెల్లవారుజామున 5 గంటలకు ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు, ప్రత్యేక అలంకరణ, మహా దీపారాధనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించిన రథంలో ఆసీనులను చేసి మాడవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలకు అన్నాడీఎంకే నగర జిల్లా సెక్రటరీ ఎస్‌ఆర్కే అప్పు, పాల ఉత్పత్తి శాఖ కో-ఆపరేటివ్ అధ్యక్షుడు, న్యాయవాది నల్లతంబి సహా పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న అన్నాడీఎంకే సెక్రటరీ అప్పు, నల్లతంబి తదితరులు

25న అన్నాడీఎంకే అభ్యర్థుల నామినేషన్ దాఖలు

ప్యారీస్, మార్చి 22: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున పోటీ చేయనున్న అభ్యర్థులు ఈనెల 25న తమ నామినేషన్ పత్రాలను ఆయా నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారులకు సమర్పించనున్నారు. డీఎంకే అభ్యర్థులు ఇష్టపడిన రోజుల్లో నామినేషన్లు దాఖలు చేయవచ్చని పార్టీ అధిష్ఠానం అనుమతించినప్పటికీ, శుక్రవారం వరకు ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. ఈ నెల 25, 26 తేదీల్లో నామినేషన్ పత్రాలు సమర్పించనున్నట్టు తెలిసింది. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో వచ్చే ఏప్రిల్ 19వ తేది ఒకే విడత సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. 40 పార్లమెంటు నియోజకవర్గాల్లో పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాలకు కూడా ఈసీ సరఫరా చేసింది. నామినేషన్ దాఖలు ప్రక్రియ ఈనెల 20న ప్రారంభమైంది. 27వ తేది వరకు ఈసీ గడువు ప్రకటించింది. ప్రస్తుతం కాంగ్రెస్ మినహా మిగతా పార్టీలన్నీ తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించాయి. దీంతో ముహూర్తం రోజులుగా భావిస్తున్న సోమ, మంగళవారాల్లో (25, 26 తేదీల్లో) ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సోమవారం అన్నాడీఎంకే అభ్యర్థులు సిమ్లా ముత్తుచోళన్ తిరునల్వేలిలో, డాక్టర్ జయవర్ధన్ దక్షిణ చెన్నైలో, విఘ్నేష్ సేలంలో, రాయపురం మనో ఉత్తర చెన్నై, ఈ.రాజశేఖర్ కాంచీపురంలో, ఏఎల్ విజయన్ అరక్కోణంలో, జయప్రకాస్ కృష్ణగిరిలో నామినేషన్లు దాఖలు చేయనున్నారు. కాగా, 26న తూత్తుకుడి నియోజకవర్గ అభ్యర్థి కనిమొళి, 27న అరక్కోణం అభ్యర్థి జగద్రక్షకన్ నామినేషన్లు దాఖలు చేస్తారు.

సెంథిల్ బాలాజీని విడుదల చేయండి

ప్యారీస్, మార్చి 22: నకిలీ దస్తావేజులు సృష్టించి మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) దాఖలు చేసిన కేసు నుంచి విడుదల చేయాలంటూ మద్రాసు సెషన్స్ కోర్టులో ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. మనీ ల్యాండరింగ్ కేసులో ఈడీ అధికారులు సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. తనకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ 25కు పైగా దాఖలు చేసిన పిటిషన్లను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో, ఈడీ కేసు నుంచి సెంథిల్ బాలాజీని విడుదల చేయాలని కోరుతూ ఆయన తరఫున దాఖలైన పిటిషన్ శుక్రవారం న్యాయమూర్తి అల్లి సమక్షంలో విచారణకు వచ్చింది. సెంథిల్ బాలాజి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సుందరం తన వాదనలో... సెంథిల్ బాలాజి ఇళ్లు, కార్యాలయాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఈడీ అధికారులు ఎలాంటి దస్తావేజులు స్వాధీనం చేసుకోలేదని, రాజకీయ కక్ష సాధింపులో ఆయనపై దాఖలు చేసిన కేసు నుంచి విడిపించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఇరుతరపు వాదనల అనంతరం తదుపరి విచారణ వారం రోజులకు వాయిదా పడింది.

గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

ప్యారీస్, మార్చి 22: స్థానిక పులియంతోపులో చట్ట వ్యతిరేకంగా గంజాయిని విక్రయించిన ఇద్దరు వ్యాపారులను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పులియంతోపు ప్రాంతంలో గురువారం రాత్రి గానాపాటలకు అనువుగా నృత్యంచేస్తూ టిక్‌టాక్ వీడియో షూటింగ్ చేసిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారివద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా, గంజాయి బయటపడింది. మొత్తం కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని, కుబేరన్, సెల్వరాజన్‌ని అరెస్టు చేశారు. వీరిని శుక్రవారం ఉదయం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రూ.27.81 లక్షల నగదు స్వాధీనం

ప్యారీస్, మార్చి 22: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు నగరవ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు రూ.27.81 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు తగిన రశీదులు చూపించి వెనక్కి తీసుకోవచ్చని పోలీసులు సూచించారు. విరుగంబాక్కం అన్నా మెయిన్ రోడ్డులో కారులో తగిన రశీదు లేకుండా తరలించిన రూ.1.30 లక్షలు, షావుకారుపేట ప్రాంతంలో ఓ ప్రైవేటు సంస్థ ఉద్యోగి నుంచి రూ.26 లక్షలు, మధురవాయల్ చెక్‌పోస్ట్ వద్ద ఓ ప్రైవేటు భవన కాంట్రాక్టర్ షణ్ముగం నుంచి రూ.51 వేలు, థౌజండ్ లైట్‌కు చెందిన నారాయణ స్వామి, అక్షయ్ కుమార్ అనే ఇద్దరు వ్యాపారుల వద్ద రూ.6.7 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం సొమ్మును ప్రభుత్వ ట్రెజరీకి అప్పగించారు.

డీపీఐ నాయకుడి హత్య: ఏడుగురి అరెస్టు

ప్యారీస్, మార్చి 22: జిల్లా కేంద్రమైన మైలాడుదురైలో డీపీఐ నాయకుడి హత్య కేసులో కళాశాల విద్యార్థి సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మైలాడుదురై కలైంజర్ కాలనీకి చెందిన అజిత్ కుమార్ (30) అనే డీపీఐ నాయకుడు తన మిత్రుడు శరవణన్(32)తో కలిసి బుధవారం రాత్రి 10 గంటలకు ఆ ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వెళుతుండగా, గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకుని వారిపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో అజిత్ కుమార్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తును ముమ్మరం చేసి పీఎంకే కార్యకర్తలే ఈ హత్య చేసినట్టు గుర్తించారు. శీర్గాళి ప్రాంతంలో ఓ ఇంట్లో తలదాచుకున్న చంద్రమోహన్, సతీష్, బాలాజీ, శ్రీరామ్ సహా ఏడుగురిని అరెస్టు చేసి నాగపట్టణం కోర్టులో హాజరుపరిచి, తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు.

కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ డీఎంకే ధర్నా

ప్యారీస్, మార్చి 22: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ నగరంలో అధికార డీఎంకే ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సెంట్రల్ రైల్వే స్టేషన్ సమీపంలోని దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయానికి ఎదురుగా జరిగిన ఈ ధర్నాలో సెంట్రల్ చెన్నై ఎంపీ దయానిధి మారన్, మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యే తాయగం దయ, ఇతర నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలను దెబ్బతీయాలన్న కుట్రతోనే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తన ఆధీనంలో ఉన్న దర్యాప్తు సంస్థలతో తనిఖీలు, అరెస్టులు చేయిస్తోందంటూ కేంద్రానికి, మోదీ, అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి, విడుదల చేశారు.

గంజాయి చాక్లెట్ల విక్రయం: ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లతో నిందితులు

వేలూరు, మార్చి 22: జిల్లా ఎస్పీ మణివన్నన్ ఉత్తర్వులతో జిల్లావ్యాప్తంగా పోలీసులు గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో, కాట్పాడి ఇన్‌స్పెక్టర్ తమిళ్‌సెల్వన్, ఎస్ఐ కార్తి నేతృత్వంలో పోలీసులు శుక్రవారం ఉదయం కాట్పాడిలో ఉన్న ప్రైవేటు యూనివర్సిటీ ఎదురుగా ఉన్న దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.25,000 విలువైన 13 ప్యాకెట్లలో ఉన్న 520 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకొని, బిహార్ రాష్ట్రానికి చెందిన కుంజన్‌కుమార్ కమ్ని, మనీష్ కుమార్ కమ్నిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

పుదుచ్చేరిలో కరెన్సీనోట్ల కంటైనర్ కలకలం

పుదుచ్చేరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో శుక్రవారం కరెన్సీనోట్ల కట్టల లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ ప్రమాదానికి గురైంది. ఆ కంటైనర్ నిండుగా నోట్ల కట్టలు న్నాయని తెలుసుకున్న ప్రజలకు పెద్ద సంఖ్యలో గుమికూడారు. పోలీసులు జరిపిన విచారణలో నైవేలిలోని ఓ జాతీయ బ్యాంక్ సేకరించిన నోట్ల కట్టలను ఆ కంటైనర్ ద్వారా చెన్నైలో రిజర్వు బ్యాంక్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. ఆ కంటైనర్ లారీకి ముందు వెనుక పోలీసులు రెండు వాహనాల్లో సెక్యూరిటీగా వెళ్లారు. ఆ కంటైనర్ లారీ పుదుచ్చేరి మరపాలం వద్ద వెళుతుండగా అదుపు తప్పి ముందు వెళ్తున్న పోలీసు వాహనాన్ని ఢీకొంది. అదృష్టవశాత్తూ కారులో ప్రయాణించిన పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదు. అదే సమయంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ఆ ప్రాంతంలో కంటైనర్ లారీ నిలవడంతో స్థానిక ట్రాఫిక్ పోలీసులు అక్కడికి వెళ్లి విచారణ జరిపారు. ఆ కంటైనర్‌లో కరెన్సీ నోట్ల కట్టలున్నట్లు తెలుసుకున్నారు. ఈ విషయం దావానలంలా పుదుచ్చేరి నగరమంతటా పాకింది. దీనితో వందల సంఖ్యలో ప్రజలు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ట్రాఫిక్ పోలీసుల విచారణ పూర్తయిన తర్వాత ఆ కంటైనర్ చెన్నైకి బయలుదేరింది. అప్పటి వరకూ ఆ ప్రాంతంలో కలకలం రేగింది.

విరుదునగర్‌లో రాధికా శరత్‌కుమార్

● 15 మందితో బీజేపీ రెండో జాబితా



విరుదునగర్ అభ్యర్థి రాధికాశరత్‌కుమార్, చిదంబరం అభ్యర్థి కాత్యాయిని - కేపీ రామలింగం

అడయార్, మార్చి 22: పుదుచ్చేరి సహా 15 లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల రెండో జాబితాను బీజేపీ శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ప్రముఖ నటి రాధికా శరత్‌కుమార్ విరుదునగర్ నియోజకవర్గంలో తామర గుర్తుపై పోటీకి దిగుతున్నారు. నామక్కల్‌లో కేపీ రామలింగం పోటీ చేయనున్నారు. తిరువళ్లూరు (రిజర్వుడు)లో పొన్ బాలగణపతి, నార్త్ చెన్నైలో పాల్ కనకరాజ్, తిరువణ్ణామలైలో అశ్వత్థామన్, తిరుప్పూరులో ఏపీ మురుగానందం, పొల్లాచ్చిలో కే.వసంతరాజన్, కరూరులో వి.వి.సెంథిల్ నాథన్, చిదంబరం (రిజర్వుడు) నియోజకవర్గంలో పి.కాత్యాయని, నాగపట్టినం (రిజర్వుడు) నియోజకవర్గంలో ఎస్‌జీఎం రమేష్, తంజావూరులో ఎం.మురుగానంద, శివగంగలో దేవనాథన్ యాదవ్, మదురైలో ఇరామ శీనివాసన్, తెన్‌కాశి (రిజర్వుడు) నియోజకవర్గంలో జాన్‌పాండ్యన్ పోటీ చేయనున్నారు. ఇక పుదుచ్చేరి నియోజకవర్గంలో నమశ్శివాయం పోటీ చేయనున్నారు.

ఇండిపెండెంట్లకు 193 గుర్తులు

ఐసిఎఫ్, మార్చి 22: ఇండిపెండెంట్ అభ్యర్థులకు 193 గుర్తులను ఎన్నికల కమిషన్ కేటాయించింది. ఈసీ ఆధ్వర్యంలో అంగీకారం పొందిన పార్టీలకు సామాన్య గుర్తులు, రిజిస్ట్రేషన్ పొందిన పార్టీల్లో కొన్నింటికీ జనరల్ గుర్తులు కేటాయించింది. గుర్తులు కేటాయించని పార్టీలు, ఇండిపెండెంట్ల కోసం 193 ప్రత్యేక గుర్తుల జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది.

విరుదునగర్‌లో విజయప్రభాకర్ పోటీ

● డీఎండీకే అభ్యర్థుల జాబితా విడుదల



అడయార్, మార్చి 22: అన్నాడీఎంకే కూటమిలో ఐదు లోక్‌సభ నియోజకవర్గాలు పొందిన డీఎండీకే అభ్యర్థుల జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఈ వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత అధికారికంగా ప్రకటించారు. విరుదునగర్‌లో డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకర్ పోటీ చేయనున్నారు. తిరువళ్లూరు (రిజర్వుడు) నియోజకవర్గంలో కే నల్లతంబి, సెంట్రల్ చెన్నైలో పి. పార్థసారథి, కడలూరులో శివకొలుందు, తంజావూరులో శివనేశన్ పోటీ చేస్తారు. డీఎండీకే అభ్యర్థులు ఐదుగురిలో నల్లతంబి, పార్థసారథి, శివకొలుందు మాజీ శాసనసభ్యులు. విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకర్ పోటీ చేస్తున్న విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో డీఎండీకేకి తొలినుంచీ ప్రత్యేక ఓటు బ్యాంక్ ఉంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మాణిక్కం ఠాకూర్ 4,70,883 ఓట్లు పొంది గెలిచారు. అన్నాడీఎంకే కూటమి తరపు పోటీ చేసిన డీఎండీకే అభ్యర్థి అళగర్‌సామి 3,16,329 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో విజయకాంత్ స్వస్థలం రామానుజపురం ఉంది. ఈ కారణంగా డీఎండీకే ఈ నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకుని విజయకాంత్ తనయుడిని పోటీకి దింపుతోంది.

ఇంటింటికీ ఓటరు హ్యాండ్ బుక్



ఐసిఎఫ్, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా పోలింగ్ బూత్ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ఓటరు హ్యాండ్ బుక్ పంపిణీ చేయనున్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లు బూత్ స్లిప్‌లు ఇంటింటికీ వెళ్లి ఉద్యోగులు అందిస్తుంటారు. ఈసారి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసే విధానం, జాబితాలో పేరు నిర్ధారణ చేసుకోవడం, పోలింగ్ తేది, పోలింగ్ బూత్‌కు తీసుకురావాల్సిన ఆధారాలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు ఫిర్యాదు నెంబర్లు, ఎన్నికల కమిషన్ వివిధ యాప్‌లు, ఓటరు ప్రతిజ్ఞ వంటి 8 పేజీల ఓటరు హ్యాండ్ బుక్ అందిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికార సత్యప్రదసాహు తెలిపారు.

ఓపీఎస్ ఇండిపెండెంట్ గుర్తుతో పోటీ



ఐసిఎఫ్, మార్చి 22: బీజేపీ కూటమిలో అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పునరుద్ధరణ కమిటీ తరఫున ఇండిపెండెంట్ చిహ్నంతో మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం రామనాథపురం నియోజకవర్గంలో పోటీ చేయనున్నారు. నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పునరుద్ధరణ కమిటీ పూర్తి మద్దతును బీజేపీకి ఇస్తున్నానని చెప్పారు. తమ లక్ష్యం రెండాకుల గుర్తు పొందడమేనని, ఇందుకోసం న్యాయపోరాటం చేస్తున్నామని, కోర్టులో కేసు పెండింగ్ ఉన్న నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికలు వచ్చాయన్నారు. రెండాకుల గుర్తు పొందడానికి ఆలస్యం అవుతున్నందున ఇండిపెండెంట్ గుర్తుతో రామనాథపురంలో పోటీ చేస్తున్నామని తెలిపారు.

నక్షత్ర వక్తలకు అనుమతి చీటీ

ఐసిఎఫ్, మార్చి 22: లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం చేయనున్న నక్షత్ర వక్తలకు అనుమతి చీటీలను ఎన్నికల కమిషన్ అందజేస్తోంది. ఈ అనుమతుల చీటీ ద్వారా ప్రచారాల్లో ప్రత్యేక హోదాను వీరు పొందవచ్చు. విమానం, ఏ వాహనాల్లో ప్రయాణించినా ఆ ఖర్చులను అభ్యర్థి భరించాలి. రిజిస్టర్ పార్టీలకు 40 మంది, అంగీకారం పొందని పార్టీలకు 20 మంది నక్షత్ర వక్తలకు అనుమతి చీటీ అందజేసింది. ఆ ప్రకారం, సీపీఎం 40, డీపీఐ, నామ్ తమిళర్ కట్చి తలా 20, ఇండియా జననాయక కట్చికి 10, తమిళనాడు రైతులు, కార్మికుల పార్టీ, అఖిల భారత జననాయగ పాదుకాప్పు కళగం తలా 15 అని మొత్తం 120 మందికి ఈ అనుమతి చీటీలు లభించాయి.



అన్నాడీఎంకే మాజీ నేతలకు

డీఎంకేలో అగ్రతాంబూలం!

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పాలకపక్షం డీఎంకేలో అన్నాడీఎంకే మాజీ నేతలు నలుగురిని అభ్యర్థులుగా ఎంపిక చేసింది. రాజకీయంగా వారి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని డీఎంకే అధినేత స్టాలిన్ వారికి టిక్కెట్లిచ్చారు. డీఎంకే మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కుడిభుజంగా వ్యవహరించిన అరక్కోణం ఎంపీ జగద్రక్షగన్ రాజకీయ జీవితం అన్నాడీఎంకేలోనే ప్రారంభమైంది. 1980, 1984లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి గెలిచారు. 1989లో ఎంజీఆర్ మృతి తర్వాత అన్నాడీఎంకే రెండు ముక్కలైనప్పుడు జానకి వర్గం తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత డీఎంకేలో చేరి కరుణకు, స్టాలిన్‌కు విశ్వాసపాత్రులయ్యారు. జగద్రక్షగన్‌పై ఐటీ కేసులు ఎక్కువగా ఉన్నా పట్టించుకోకుండా డీఎంకే సాహసించి రెండోసారి అరక్కోణం టిక్కెటిచ్చింది.

తంగ తమిళ్‌సెల్వన్...

తంగ తమిళ్‌సెల్వన్ రాజకీయ జీవితం అన్నాడీఎంకేతోనే ప్రారంభమైంది. జయలలిత కోసం ఆండిపట్టి శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి రాజకీయంగా వెలుగులోకి వచ్చారు. తంగ తమిళ్‌సెల్వన్ సేవలను మెచ్చుకుని జయలలిత ఆయనను రాజ్యసభ సభ్యుడిగా పంపారు. జయ మృతి తర్వాత ఆయన దినకరన్ వర్గంలో చేరారు. 2019లో అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం తరఫున తేనిలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అదే యేడాది డీఎంకేలో చేరారు. ప్రస్తుతం తేని లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.

సెల్వ గణపతి....

అన్నాడీఎంకేలో చక్రం తిప్పిన నాయకుల్లో సెల్వగణపతి ఒకరు. 1991-96 మధ్య స్థానిక సంస్థల శాఖ మంత్రిగా పనిచేశారు. 1999లో అన్నాడీఎంకే తరఫున సేలం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచారు. 2009లో డీఎంకేలో చేరారు. 2010లో రాజ్యసభ సభ్యుడిగా గెలుపొందారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో మంత్రిగా పనిచేసినప్పుడు సెల్వగణపతి శ్మశానవాటికల షైకప్పుల కొనుగోళ్లలో జరిగిన అవినీతి కేసులో రెండేళ్ల జైలు శిక్షపడటంతో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రస్తుతం 25 యేళ్ల తర్వాత సెల్వగణపతి మరోమారు సేలం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేయనున్నారు.

గణపతి రాజ్‌కుమార్...

కోయంబత్తూరులో డీఎంకే తరపు పోటీ చేయనున్న గణపతి రాజ్‌కుమార్ రాజకీయ జీవితం కూడా అన్నాడీఎంకేతోనే ప్రారంభమైంది. 2014లో అన్నాడీఎంకే తరఫున కోయంబత్తూరు కార్పొరేషన్ మేయర్‌గా గెలిచారు. ఆ సమయంలో మంత్రి ఎస్పీ వేలుమణి తదితర నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారు. జయలలిత జీవిత విశేషాలపై పీహెచ్‌డీ చేసి డాక్టర్ పట్టా పొంది ఆమె ఆశీస్సులందుకున్నారు. జయకు అత్యంత విశ్వాసపాత్రుడిగాను మెలిగారు. జయ మృతి తర్వాత వేలుమణితో మనస్పర్థలు వచ్చాయి. దీంతో అన్నాడీఎంకేని విడిచిపెట్టి డీఎంకేలో చేరారు. ప్రస్తుతం కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేయనున్నారు.



జగద్రక్షగన్, సెల్వగణపతి, గణపతి రాజ్‌కుమార్, తంగ తమిళ్‌సెల్వన్

ఎన్డీఏ కూటమిలో ఏయే పార్టీలకు ఏయే నియోజకవర్గాలు

ఐసిఎఫ్, మార్చి 22: బీజేపీ కూటమిలో తొమ్మిది మందితో కూడిన మొదటి జాబితా పార్టీ విడుదల చేసింది. రామనాథపురంలో పోటీ చేస్తున్నట్లు ఓపీఎస్ ప్రకటించారు. అనంతరం పీఎంకే వంటి పార్టీలు పోటీ చేస్తున్న స్థానాల వివరాలు ఇలా ఉన్నాయి...

బీజేపీ (19 నియోజకవర్గాలు)

తిరువళ్లూర్ (రిజర్వుడు), ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై, మధ్య చెన్నై, కృష్ణగిరి, తిరువణ్ణామలై, నామక్కల్, తిరుప్పూర్, నీలగిరి (రిజర్వుడు), కోయంబత్తూర్, పొల్లాచ్చి, కరూర్, చిదంబరం (రిజర్వుడు), నాగపట్టినం (రిజర్వుడు), తంజావూరు, మదురై, విరుదునగర్, తిరునల్వేలి, కన్నియాకుమారి

పీఎంకే (10 నియోజకవర్గాలు)

కాంచీపురం (రిజర్వుడు), అరక్కోణం, ధర్మపురి, ఆరణి, విల్లుపురం(రిజర్వుడు), కళ్లకుర్చి, సేలం, దిండుగల్, మైలాడుదురై, కడలూరు

టీఎంసీ (3 నియోజకవర్గాలు) ఈరోడ్, శ్రీ పెరుంబుదూర్, తూత్తుకుడి

ఏఎంఎంకే: (2 నియోజకవర్గాలు): తిరుచ్చి, తేని, **పుదియ నీతి కట్చి :** వేలూరు

ఇండియ జననాయగ కట్చి: పెరంబలూరు

ఇండియ మక్కల్ కల్వి మున్నేట్ర కళగం: శివగంగ

తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం: తెన్‌కాశి (రిజర్వుడు)

అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పునరుద్ధరణ కమిటీ: రామనాథపురం (ఓపీఎస్).

పీఎంకే అభ్యర్థుల జాబితా విడుదల

● కడలూరులో సినీ దర్శకుడు తంగర్‌బచ్చన్



పీఎంకే అభ్యర్థులు కె.బాలు, తంగర్‌బచ్చన్, తిలకభామ - సౌమ్యా అన్బుమణి

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే మిత్రపక్షం పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) పది నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక అందరూ అనుకున్నట్టే ఈ ఎన్నికల్లో పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి పోటీ చేయలేదు. కడలూరు నియోజకవర్గంలో ప్రముఖ తమిళ సినీ దర్శకుడు తంగర్‌బచ్చన్‌ను అభ్యర్థిగా ఎంపిక చేసింది. కాంచీపురం(రిజర్వుడు) నియోజకవర్గం అభ్యర్థిని పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. ఈమేరకు వి.జ్యోతి వెంకటేశన్ పోటీ చేయున్నారు. దిండుగల్ నియోజకవర్గంలో పీఎంకే కోశాధికారి కవయిత్రి ఎం.తిలకభామ పోటీ చేయనున్నారు. అరక్కోణంలో పీఎంకే ప్రచార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది కే.బాలు, ఆరణిలో మాజీ ఎమ్మెల్యే తిరువణ్ణామలై, ఈస్ట్ జిల్లా శాఖ కార్యదర్శి ఎ.గణేష్‌కుమార్, మైలాడుదురైలో తంజావూరు నార్త్ జిల్లా శాఖ కార్యదర్శి ఎం.కే. స్టాలిన్, కళ్లకురిచ్చిలో పీఎంకే శాఖ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ ఇరా దేవదాస్ పోటీ చేయనున్నారు. ఇదే విధంగా ధర్మపురిలో అన్బుమణి సతీమణి సౌమ్యా అన్బుమణి, సేలంలో సేలం సౌత్ జిల్లా శాఖ మాజీ కార్యదర్శి ఎ.అన్నాదురై, విల్లుపురంలో పీఎంకే విద్యార్థి విభాగం కార్యదర్శి మురళీ శంకర్ పోటీ చేయనున్నారు.

పదోసారి కన్నియాకుమారిలో పోటీ




పొన్‌రాధాకృష్ణన్

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్ ప్రపంచ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో పదోసారి పోటీ చేయనున్నారు. రాష్ట్రంలో తొలి నుంచీ బీజేపీకి చెక్కుచెదరని ప్రత్యేక ఓటు బ్యాంక్ కలిగిన నియోజకవర్గంగా కన్నియాకుమారి పేరుగడించింది. ఈ నియోజకవర్గంలో 1991 నుంచీ పొన్‌రాధాకృష్ణన్ పట్టువదలని విక్రమార్కుడిలా బీజేపీ తరఫున వరుసగా పోటీ చేస్తున్నారు. తొమ్మిదిసార్లు జరిగిన ఎన్నికల్లో ఆయన 1999, 2014లో గెలిచి కేంద్ర మంత్రివర్గంలో స్థానం సంపాదించుకున్నారు. ఏడుసార్లు ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం 72 వయస్సులో ఆయనకు త్వరలో గవర్నర్ పదవి లభిస్తుందని పార్టీ నేతలందరూ భావిస్తూ వచ్చారు. అయితే బీజేపీ అధిష్ఠానం ఆయన్ను కన్నియాకుమారిలో మళ్లీ పోటీకి దింపింది. ఈ నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరఫున పసిలియాన్ నజరతే పోటీ చేయనున్నారు. డీఎంకే కూటమి ఈ నియోజకవర్గాన్ని కాంగ్రెస్‌కు కేటాయించడంతో సిట్టింగ్ ఎంపీ విజయ్‌వసంత్ మళ్లీ పోటీ చేసే అవకాశం ఉంది. పొన్ రాధాకృష్ణన్ స్వస్థలం కన్నియాకుమారి జిల్లా రాజాక్కామంగళం. అవివాహితుడైన రాధాకృష్ణన్.. నాడార్ కులానికి చెందినవారు. ఆ కులస్థులు కన్నియాకుమారిలో అధికంగా ఉండటం ఈయనకు ప్లస్‌పాయింట్ అవుతుందని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. తన ఎంపిక పట్ల హర్షం ప్రకటించిన రాధాకృష్ణన్... మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకం ఉంచి మళ్ళీ పార్టీ టికెట్ ఇచ్చిందని, కేంద్ర మంత్రిగా ఉన్న కన్నియాకుమారి నియోజకవర్గంలో చేపట్టిన పథకాలు గురించి ప్రచారం చేసి తప్పకుండా గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా మరిన్ని పథకాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

రెండుసార్లు సీఎం, ఏడుసార్లు ఎమ్మెల్యే...

● పుదుచ్చేరి బరిలోకి సీనియర్ కాంగ్రెస్ నేత

పుదుచ్చేరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో ఏడుసార్లు శాసనసభ్యుడిగా, ఓ సారి ఎంపీగా గెలిచి, రెండు సార్లు ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలందించిన వైద్యలింగం ఈ దఫా లోక్‌సభకు కాంగ్రెస్ తరఫున పోటీకి దిగుతున్నారు. పుదుచ్చేరి సమీపం నెట్టాపాక్కంలోని వ్యవసాయ కుటుంబంలో 1950 అక్టోబర్ 5న వైద్యలింగం జన్మించారు. పుదుచ్చేరి రెండో ముఖ్యమంత్రి వెంకటసుబ్బారెడియార్ కుమారుడైన వైద్యలింగం... చెన్నై లయోలా కళాశాలలో విద్యనభ్యసించారు. ఆ తర్వాత వ్యవసాయం చేశారు. 1969లో శశికళను వివాహం చేసుకున్నారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులందరూ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. ఈయన కూడా 1971 నుంచీ కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. 1980లో నెట్టాపాక్కం శాసనసభ నియోజకవర్గంలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 1985లో మళ్లీ ఆ నియోజకవర్గంలోనే పోటీ చేసి గెలిచారు. అప్పటి ఫారూఖ్ నాయకత్వంలోని కాంగ్రెస్ మంత్రివర్గంలో ప్రజాపనుల శాఖ మంత్రిగా సేవలందించారు. 1991లో అదే నియోజకవర్గంలో గెలిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. 1996 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1996 ఎన్నికల్లో నెట్టాపాక్కంలోనే పోటీ చేసి గెలిచారు. 2000 వరకు ప్రతిపక్షనేతగా వ్యవహరించారు. 2001, 2006 ఎన్నికల్లో శాసనసభ్యుడిగా గెలిచారు. రంగసామి మంత్రివర్గంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. రంగసామిని ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించినప్పుడు 2008లో వైద్యలింగం ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2011 వరకు రెండున్నర సంవత్సరాలుపాటు సీఎంగా కొనసాగారు. నెట్టాపాక్కం నియోజకవర్గంలో ఐదుసార్లు పోటీ చేసిన గెలిచిన వైద్యలింగం 2011లో నియోజకవర్గాల పునర్విభజన కారణంగా కామరాజర్ నగర్‌లో పోటీ చేసి గెలిచి ప్రధాన ప్రతిపక్షనేతగా పనిచేశారు. 2016లో కామరాజర్ నగర్‌లో పోటీ చేసి గెలిచి స్పీకర్‌గా సేవలందించారు. ఆ తర్వాత ఆ పదవికి రాజీనామా చేసి 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. 2023లో పుదుచ్చేరి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. పుదుచ్చేరిలో పార్టీకి విశిష్ట సేవలందించిన కారణంగానే కాంగ్రెస్ అధిష్ఠానం వైద్యలింగంకు మరోమారు పార్టీ టిక్కెట్ ఇచ్చింది.



వైద్యలింగం



ఆడియో రిలీజ్ దృశ్యం

'ఇడి మిన్నల్ కాదల్' ఆడియో రిలీజ్

చిత్రజ్యోతి

పావకి ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో జయచందర్ పిన్నమనేని, బాలాజీ మాధవన్ నిర్మాణంలో దర్శకుడు బాలాజీ మాధవన్ తెరకెక్కించిన చిత్రం 'ఇడి మిన్నల్ కాదల్'. ఇందులో శిబి, భవ్య త్రిక, యాస్మిన్ పొన్నప్ప తదితరులు నటించిన ఈ మూవీని ఎమోషనల్ డ్రామాగా రూపొందించారు. ఈ నెల 29న విడుదలకానున్న నేపథ్యంలో గురువారం రాత్రి ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో తమిళ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్, కోశాధికారి పేరరసు, సీనియర్ దర్శకుడు పి.వాసు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సదర్భంగా దర్శకుడు బాలాజీ మాట్లాడుతూ... 'దర్శకుడు వాసు వంశం నుంచి మూడోతరం దర్శకుడిగా చిత్రపరిశ్రమకు వచ్చా. దర్శకుడు మిష్కిన్ వద్ద అసిస్టెంట్‌గా నా సినీ ప్రయాణం ప్రారంభమైంది. ఆ తర్వాత హీరో మాధవన్‌ను నటుడి వేషం కోసం సంప్రదించగా, ఆయన 'రాకెట్రీ' స్క్రిప్టు చేతికిచ్చారు. ఆ తర్వాత ఆయనతో కలిసి పనిచేశా. నిర్మాత జయచందర్ మాట్లాడుతూ... 'కథను నమ్మి ఈ చిత్రాన్ని నిర్మించాం. మీడియా మిత్రులు అండగా ఉండాలి' అని కోరారు. హీరో శిబి మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరికీ మెంటల్ హెల్త్ ఎంత ముఖ్యమో ఈ చిత్రం తెలియజేస్తుంది' అన్నారు.

విద్యార్థుల సమక్షంలో 'సూదుకవ్వుం2' ఫస్ట్‌లుక్ రిలీజ్



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న మిర్చి శివ, హరిషా

హాస్య నటుడు మిర్చి శివ - హరిషా జంటగా ఎస్.జే.అర్జున్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సూదుకవ్వుం-2'. ఫస్ట్‌లుక్‌ను రాజలక్ష్మి ఇంజనీరింగ్ కాలేజీలో దాదాపు పది వేలమంది విద్యార్థుల సమక్షంలో రిలీజ్ చేశారు. గత 2013లో నలన్ కుమారస్వామి దర్శకత్వంలో నటుడు విజయ్ సేతుపతి హీరోగా 'సూదుకవ్వుం' పేరుతో వచ్చిన చిత్రం ఘన విజయం సాధించింది. ఇందులో సంచితా శెట్టి, అశోక్ సెల్వన్, బాబీ సింహా, రమేష్ తిలక్, కరుణాకరన్ ముఖ్య పాత్రలను పోషించారు. ఇది బ్లాక్‌బస్టర్ అయ్యింది. ఆ సినిమాకు సీక్వెల్‌గా 'సూదుకవ్వుం-2' వస్తోంది. ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలను అర్జున్ చేపట్టగా, మిర్చి శివ హీరోగా నటిస్తున్నారు. తంగం సినిమాస్ బ్యానరుపై ఎస్.త్యాగరాజన్, సీవీ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

25 యేళ్ల తర్వాత రెహ్మాన్, ప్రభుదేవా కాంబో రిపీట్



ప్రభుదేవా - రెహ్మాన్

ఏ.ఆర్.రెహ్మాన్, ప్రభుదేవా 25 యేళ్ల తర్వాత కలిసి పనిచేయనున్నారు. వీరిద్దరు చిత్రపరిశ్రమకు దాదాపు ఒకే సమయంలో పరిచయమై అంచలంచెలుగా ఎదిగారు. అస్కార్ అవార్డు విజేతగా, సంగీత ప్రపంచంలో రారాజుగా ఏ.ఆర్.రెహ్మాన్ వెలుగొందుతుండగా, ప్రభుదేవా నృత్య దర్శకుడిగా, నటుడిగా, హీరోగా, దర్శకుడిగా రాణిస్తున్నారు. ప్రభుదేవా హీరోగా నటించిన 'కాదలన్', 'లవ్‌బర్డ్స్', 'మిస్టర్ రోమియో', 'మిన్సార కణవు' వంటి చిత్రాలకు ఏ.ఆర్.రెహ్మాన్ సంగీత స్వరాలు అందించగా, ఈ చిత్రాల్లోని పాటలు సినీ ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఆ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఒక్క చిత్రం కూడా రాలేదు. ఈ నేపథ్యంలో 25 యేళ్ల తర్వాత ఈ కాంబో రిపీట్ కానుంది. పాన్ ఇండియా మూవీగా తెరకెక్కనున్న చిత్రంలో ప్రభుదేవా, యోగిబాబు, అజువర్గీస్, అర్జున్‌అశోకన్, మొట్టై రాజేంద్రన్ తదితరులు నటించనున్నారు. బిహైండ్ ఉడ్స్ సమర్పణలో ఈ చిత్రానికి సంగీతం రెహ్మాన్, నిర్మాతలు మనోజ్ ఎన్ఎస్, దివ్య మనోజ్, డాక్టర్ ప్రవీణ్ ఎలక్, దర్శకత్వం ఎన్.ఎస్.మనోజ్.



షారిక్ హాసన్ - హరిత

ఫ్రెండ్స్ మిస్సింగ్ మిస్టరీగా

'నేట్రు ఇంద నేరం'

● 29న రిలీజ్

క్లాప్ ఇన్ఫోటైన్మెంట్ పతాకంపై నవీన్ కుమార్ నిర్మాణ సారథ్యంలో సాయ్ రోషన్ కేఆర్, రచన,దర్శకత్వం వహించిన 'నేట్రు ఇంద నేరం'అనే సినిమా నిర్మాణాంతర కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకుని ఈనెల 29న విడుదలకానుంది. 'బిగ్‌బాస్' ఫేం షారిక్ హాసన్ ప్రధాన పాత్రను పోషించిన ఈ చిత్రంలో హరిత, మోనిక రమేష్ హీరోయిన్లు. ఈ చిత్రానిక కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలను నితిన్ ఆదిత్య, సాయి రోషన్ కేఆర్ సమకూర్చారు. క్రైం థ్రిల్లర్ జోనర్‌లో ఫ్రెండ్ మిస్సింగ్ మిస్టరీ స్క్రీన్‌ప్లే సాగుతుంది. చెన్నై, ఊటీల్లో చిత్రీకరణ జరుపుకుంది. కెవిన్ ఎన్ సంగీతం అందించిన ఈ చిత్రానికి విశాల్ మణివణ్ణన్ సినిమాటోగ్రఫీ అందించారు. ఎడిటింగ్ గోవింద్.

మారిటైమ్ ఇన్‌స్టిట్యూట్‌లో
డిప్లొమా, డిగ్రీ

పుణెలోని తొలాని మారిటైమ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎంఐ)- డిగ్రీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్, బీఎస్సీ నాటికల్ సైన్స్, డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ఐఎంయూ సెట్ 2024 అర్హత తప్పనిసరి. అలాగే సంస్థ నిర్వహించే సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (టీఎంఐఎస్ఏటీ) రాయాల్సి ఉంటుంది. డిప్లొమాలో ప్రవేశానికి ఈ టెస్ట్ రాయనవసరం లేదు. డిగ్రీ ప్రోగ్రామ్‌లకు అవివాహితులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మహిళలకు ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ వర్తిస్తుంది. అడ్మిషన్ నాటికి అభ్యర్థులకు పాస్‌పోర్ట్ ఉండాలి.

బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. థియరిటికల్, ప్రాక్టికల్, వర్క్‌షాప్ ట్రెయినింగ్‌లు ఉంటాయి. ఇంజనీరింగ్ సైన్సెస్ సబ్జెక్టులు; షిప్ బోర్డ్ మెషినరీకి సంబంధించి మెరైన్, మెకానికల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు ఉంటాయి. చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది.

బీఎస్సీ నాటికల్ సైన్స్: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇంజనీరింగ్ మేథమెటిక్స్, ఫిజిక్స్, నాటికల్ టెక్నాలజీ, నేవిగేషన్, కార్గో ఆపరేషన్స్, షిప్ మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్స్ సంబంధిత సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో షిప్ బోర్డ్ టూల్స్, ప్రాక్టికల్ సీమన్‌షిప్, సెయిలింగ్, బోట్ హ్యాండిలింగ్‌లపై వర్క్‌షాప్ ట్రెయినింగ్ ఉంటుంది.

డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్: ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో 120 సీట్లు ఉన్నాయి. ఇది ప్రీ సీ డెక్ క్యాడెట్ కోర్సు. ఇది పూర్తయిన తరవాత ఏడాదిన్నర వ్యవధిగల ఆన్ బోర్డ్ షిప్ ట్రెయినింగ్ ఉంటుంది. దీనిని పూర్తిచేసినవారికి అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్(ఏడీఎన్ఎస్)ను ప్రదానం చేస్తారు. తరవాత షిప్పింగ్ కంపెనీలు ఆఫర్ చేసే ఆన్ బోర్డ్ ట్రెయినింగ్ కూడా చేస్తే బీఎస్సీ(అప్లయిడ్ నాటికల్ సైన్స్) డిగ్రీని ఇస్తుంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టుగా ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. పదోతరగతి/ఇంటర్ స్థాయిలో ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

వయసు: డిగ్రీ ప్రోగ్రామ్‌లకు పురుషులు 2003 సెప్టెంబరు 1 తరవాత, మహిళలు 2001 సెప్టెంబరు 1 తరవాత జన్మించి ఉండాలి. డిప్లొమాకు 25 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ఇంటర్ స్థాయిలో గ్రూప్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులు, ఐఎంయూ సెట్ 2024 ర్యాంక్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ) నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం పర్సనల్ ఇంటర్వ్యూలు, మెడికల్ టెస్ట్‌లు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

టీఎంఐ ఎస్ఏటీ వివరాలు: ఇది ఆన్‌లైన్ ఎగ్జామ్. ఇందులో భాగంగా మొదట మెయిన్ టెస్ట్ ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఉంటాయి. పరీక్ష సమయం గంటన్నర. తరవాత బిహేవియరల్ అసెస్‌మెంట్ ఉంటుంది. దీనికి అర్థగంట సమయం కేటాయించారు. ఇంటర్వ్యూలో అభ్యర్థి ఆలోచన విధానం, పరిపక్వత స్థాయి, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ సామర్థ్యం తదితరాలు పరీక్షిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** డీఎన్ఎస్ ప్రోగ్రామ్‌నకు ఏప్రిల్ 30; మిగిలిన ప్రోగ్రామ్‌లకు మే 31
- **వెబ్‌సైట్:** tmi.tolani.edu



టీఎస్ ఎల్‌పీసెట్ నోటిఫికేషన్

హైదరాబాద్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ (ఎస్‌బీటీఈటీ)- 'లేటరల్ ఎంట్రీ ఇన్‌టూ పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎల్‌పీసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో రెండో ఏడాది ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాలిటెక్నిక్‌లు సహా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కాలేజీల ఆధ్వర్యంలోని సెకండ్ షిఫ్ట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎల్‌పీసెట్ ద్వారా డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సంబంధిత విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. లేదంటే నిర్దేశిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ అడ్మిషన్ తీసుకోవచ్చు.

అర్హత: అభ్యర్థులు రెండేళ్ల ఐటీఐ కోర్సు ఉత్తీర్ణతతో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్(డీఈటీ) అందించే బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

- ఐటీఐ(డ్రాఫ్ట్స్‌మన్-సివిల్) పూర్తిచేసినవారు డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్) కోర్సుకు; ఐటీఐ(డ్రాఫ్ట్స్‌మన్-మెకానిక్, ఫిట్టర్, మెషినిస్ట్/మెషినిస్ట్ కంపోజిట్, మెషినిస్ట్ గ్రిండర్, టర్నర్, మోటార్ వెహికిల్ మెకానిక్, మెకానిక్-ఆర్ అండ్ ఏసీ) అభ్యర్థులు డిప్లొమా(మెకానికల్/ఆటోమొబైల్/మెటలర్జికల్/ప్యాకింగ్ టెక్నాలజీ/టెక్స్‌టైల్ టెక్నాలజీ/మైనింగ్) కోర్సులకు; ఐటీఐ(ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రీషియన్) అభ్యర్థులు డిప్లొమా(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్)కోర్సులకు; ఐటీఐ(ఐసీటీ అండ్ సిస్టమ్ మెయింటెనెన్స్) అభ్యర్థులు డిప్లొమా(కంప్యూటర్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్) కోర్సులకు అర్హులు.

ఎల్‌పీ సెట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ నుంచి 60, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద హెచ్‌బీ పెన్సిల్‌తో గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 40 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి దరఖాస్తు ఫీజు డీడీని జతచేసి మాసబ్ ట్యాంక్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో సబ్మిట్ చేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉండే తేదీ:** ఏప్రిల్ 16 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **ఎల్‌పీసెట్ 2024 తేదీ:** మే 20
- **పరీక్ష కేంద్రం:** గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** sbtet.telangana.gov.in

ఎన్.జీ రంగా వర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

గుంటూరులోని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(ఏఎన్‌జీఆర్ఏయూ) ఆధ్వర్యంలోని ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్ - ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు(రెండు నెలలు). వీటిని తెలుగు మాధ్యమంలో నిర్వహిస్తారు. కోర్సులు ఏప్రిల్ నెలలో ప్రారంభమౌతాయి. కోర్సులో భాగంగా వారానికి ఒకటి చొప్పున ఏడు ఆన్‌లైన్ క్లాసెస్ ఉంటాయి. క్లాస్ వ్యవధి రెండు గంటలు. ప్రతి క్లాస్‌లో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు ఉంటాయి. అటెండెన్స్ తప్పనిసరి. కోర్సుకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఇస్తారు. చివరి వారంలో ఎగ్జామ్ ఉంటుంది. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్‌లు ఇస్తారు. ఈ ఎగ్జామ్‌లో ఫెయిల్ అయినవారికి/హాజరు కానివారికి నెలలోపు మరల పరీక్ష ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి దరఖాస్తు ఫీజు డీడీ/మనియార్డర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.

కోర్సులు

- సేంద్రీయ వ్యవసాయం
- పుట్టగొడుగుల పెంపకం

అర్హత: తెలుగులో చదవడం, రాయడం తెలిసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. అభ్యర్థులకు కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్, ఆన్‌లైన్ సదుపాయం ఉండాలి.

- **కోర్సు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25
- **చిరునామా:** ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్, డీన్ కార్యాలయం, పరిపాలనా భవనం, ఆచార్య ఎన్.జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/iq5dSZlలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

ఖాళీలు 97

ముంబయిలోని స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ- సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: జనరల్, లీగల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్), రీసెర్చ్, అఫీషియల్ లాంగ్వేజ్

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి అభ్యర్థుల గరిష్ఠ వయస్సు 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: ఫేజ్-1, ఫేజ్-2 ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 13. ప్రకటనకు సంబంధించిన పూర్తి సమాచారం ఏప్రిల్ 13న ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది.

వెబ్‌సైట్: https://www.sebi.gov.in/



ఇండియన్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 146

ఇండియన్ బ్యాంక్... దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో కింద పేర్కొన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్

విభాగాలు: క్రెడిట్, ఎస్ఆర్ బిజినెస్ రిలేషన్‌షిప్, సెక్యూరిటీ, ఎంఎస్ఎంఈ రిలేషన్‌షిప్, డిజిటల్ మార్కెటింగ్, ఎస్ఈవో అండ్ వెబ్‌సైట్ స్పెషలిస్ట్, సోషల్ మీడియా స్పెషలిస్ట్, క్రియేటివ్స్ ఎక్స్‌పర్ట్, ఫారెక్స్/ట్రేడ్ ఫైనాన్స్, ట్రెజరీ డీలర్, ట్రేడింగ్/ఆర్బిట్రేజ్ ఇన్ కరెన్సీ ఫ్యూచర్స్, ట్రేడింగ్ ఇన్ ఇంటర్‌బ్యాంక్, ఈక్విటీ డీలర్ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/సీడబ్ల్యూఏ/ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1

వెబ్‌సైట్: www.indianbank.in/

నవ్య | చిత్రజ్యోతి

కష్టపడే వాళ్లే ఫ్యామిలీ స్టార్లు



దిల్ రాజు

తమ కుటుంబాలను పైకి తీసుకొచ్చేందుకు కష్టపడేవాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే అని నిర్మాత దిల్ రాజు అన్నారు. శుక్రవారం తెలుగు సినీ జర్నలిస్టుల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మా సినిమాకు 'ఫ్యామిలీస్టార్' అని డిఫరెంట్ టైటిల్ పెట్టినప్పుడు చాలా మంది ఏమనుకున్నారంటే, 'విజయ్ దేవరకొండను స్టార్‌గా చూపించడానికే ఇలాంటి టైటిల్ పెట్టారు' అని అనుకున్నారు. ఈ టైటిల్ పెట్టడానికి ఓ కారణం ఉంది. మీరంతా మీ కుటుంబాలను వృద్ధిలోకి తెచ్చేందుకు కష్టపడుతున్నారు. అలాంటి వాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే అని చెప్పడమే మా ఆలోచన. నాలాంటి వాళ్లం సినీ రంగంలోకి వచ్చి ప్రయోజకులమై మా కుటుంబానికి సంఘంలో ఒక గౌరవం కల్పించాం. అందుకే మాలాంటి వాళ్లు, మీలాంటి వాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే. అదే మా ఫ్యామిలీ స్టార్ టైటిల్ కథ. అంతేగానీ విజయ్ దేవరకొండను స్టార్‌గా చూపించడానికి ఈ సినిమా చేయలేదు. దిల్ రాజు బ్రాండ్‌తో వచ్చే ఒక కుటుంబ కథా చిత్రం అంటే చాలా గొప్పగా ఉంటుంది. ఆ పేరు నిలబెడుతుంది. మీ అందరిలోనూ ఫ్యామిలీ స్టార్లు ఉన్నారు అని చెప్పడానికే ఈ సినిమా తీశాం' అని తెలిపారు. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పరశురామ్ పెట్ల దర్శకుడు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

రస్టిక్ లవ్‌స్టోరీ.. షూట్ డైరీస్

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా రూపొందుతున్న 'తండేల్' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంతో జరుగుతోంది. దేశభక్తి అంశాలు కలిగిన ఈ రస్టిక్ లవ్‌స్టోరీని చందు మొండేటి రూపొందిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. 'తండేల్' సెట్స్‌లో నాగచైతన్య, అల్లు అరవింద్, సాయిపల్లవి, చందు మొండేటి, నిర్మాత బన్నీ వాసు ఉన్న వర్కింగ్ స్టిల్స్‌ను షూట్ డైరీస్ పేరుతో విడుదల చేశారు. నాగచైతన్య, సాయిపల్లవి ఇద్దరూ పాత్రలకు తగినట్లుగా డీ గ్లామరెస్‌గా కనిపిస్తున్నారు. ఒక ప్రామాణికంగా ఈ కథను చెప్పాలని దర్శకుడు చందు నటీనటుల గెటప్స్, కాస్ట్యూమ్స్ యాస విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తండేల్ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకుడు.



ఈ సినిమా కోసం బరువు పెరిగి, 31 కిలోలు తగ్గా



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ది గోట్ లైఫ్' చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. మలయాళ, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ అవుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలుగులో ప్రేక్షకులకు అందిస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో హీరో పృథ్వీరాజ్ మాట్లాడుతూ 'ఇందులో నజీబ్‌గా నేను నటించా. 2009లో ఈ సినిమా అనుకున్నాం. కానీ భారీ బడ్జెట్ అవసరం కావడంతో వెనుకంజ వేశాం. ప్రాంతీయ సినిమాల మార్కెట్ పరిధి పెరగడంతో పదేళ్ల తర్వాత 2018లో షూటింగ్ ప్రారంభించాం. ఈ చిత్రం కోసం నేను మొదట బరువు పెరిగి ఆ తర్వాత 31 కిలోలు తగ్గా. ఏడాదిన్నర పాటు అల్జీరియాలోని టిముహౌస్ అనే ప్రాంతంలో షూటింగ్ చేశాం. సహార ఎడారి మధ్యలో ఉంటుందా లోకేషన్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏడాదిన్నర పాటు జరిగాయి' అని వివరించారు. 'ఈ సినిమాను మొదట రాజస్థాన్ ఎడారిలో తీయాలనుకున్నాం. అయితే డీప్ డిజర్ట్ దొరకలేదు. అందుకే విదేశాలకు వెళ్లి షూటింగ్ చేశాం. ఏడారిలోనే 150 రోజులు షూట్ చేశాం. బడ్జెట్ పెరిగినా మేం అనుకున్న ఫీల్ తీసుకురాగలిగాం' అన్నారు దర్శకుడు బ్లెస్సీ. సమావేశంలో పాల్గొన్న హాలీవుడ్ నటుడు జిమ్మీ జీన్ లూయిస్ తను నటించిన తొలి భారతీయ చిత్రమిదని చెప్పారు. నజీబ్‌కు సాయం చేసే కీలక పాత్ర తనదని తెలిపారు. ఇలాంటి అద్భుత చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు గర్వంగా ఉందని నిర్మాత వై రవిశంకర్ చెప్పారు.

మళ్లీ గోవాలో దేవర

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ డ్రామా 'దేవర పార్ట్ 1. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన భారీ షెడ్యూల్ ఇటీవల గోవాలో జరిగింది. తాజా షెడ్యూల్ కూడా గోవాలో మొదలైంది. నృత్య దర్శకుడు రాజు సుందరం సారథ్యంలో ఓ మాంటేజ్ సాంగ్‌ను అక్కడ చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ స్టిల్స్ మీడియాకు విడుదల చేశారు. ఇందులో ఎన్టీఆర్ సరికొత్త లుక్‌తో కనిపించారు. ఓ కొత్త తరహా పాత్రలో ఆయన్ని చూడడానికి అభిమానులు, ప్రేక్షకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. తొలి భాగాన్ని విజయదశమి సందర్భంగా అక్టోబర్ 10న విడుదల చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన 'దేవర' గ్లింప్స్ సెన్సేషన్ క్రియేట్ చేసిందనీ, ఇండియన్ సినిమాలోనే ఎక్కువ మంది చూసిన గ్లింప్స్‌గా సరికొత్త రికార్డ్ సృష్టించిందని నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ చెప్పారు. నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



పార్టీ కాదు పెద్ద బాధ్యత

'ఇప్పటిదాకా నా జీవితంలో శని, ఆదివారాలు రిలాక్స్ అవ్వడం అనేది లేదు. ఏదో ఒక సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండేదాన్ని. ఆ రోజున ఫ్రెండ్స్ కలుద్దామని అడిగినా వీలు కాదని చెప్పేదాన్ని. ఇక నుంచి వారాంతంలో రిలాక్స్ అవ్వడం గురించి ఆలోచిస్తున్నాను' అని అన్నారు తమన్నా. నటుడు విజయ్ వర్మతో ఆమె ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. త్వరలోనే వారిద్దరూ పెళ్లి పీటలెక్కబోతున్నారు. ఈనేపథ్యంలో తన జీవితంలో సరికొత్త మార్పుకు శ్రీకారం చుడుతున్నట్లు తమన్నా తెలిపారు. 'పెళ్లంటే పార్టీ కాదు. అది చాలా పెద్ద బాధ్యత. జీవితం పూర్తి భిన్నంగా ఉంటుంది. షూటింగ్ పూర్తి చేసుకోని సాయంత్రానికల్లా ఇంటికి చేరి పిల్లలతో గడపాలి. ఎందుకంటే అదే భూమ్మీద మనం సంతోషంగా ఉండే ప్లేస్. ఇదంతా తలుచుకున్నప్పుడల్లా ఎంతో ఉద్విగ్నంగా అనిపిస్తుంది' అని తమన్నా అన్నారు.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/toJ68w6లో చదవండి.

డబుల్ ధమాకా



సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రం యూత్‌ను బాగా అలరించింది, ఇప్పుడు దానికి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్' చిత్రం అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకుంది. సెన్సార్ ఫార్మలిటీస్ కూడా అవడంతో ఈ నెల 29న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. 'డీజె టిల్లు' చిత్రం కంటే రెట్టింపు వినోదం ఈ సినిమా అందిస్తుందనీ, ముఖ్యంగా టిల్లు పాత్ర, అతను పలికే సంభాషణలు అలరిస్తాయని దర్శకనిర్మాతలు చెప్పారు. టిల్లు డబుల్ ధమాకా ను చిత్రంలో చూడవచ్చని అన్నారు. ఈ సినిమాలో లిల్లీ పేరు కలిగిన బోల్డ్ క్యారెక్టర్‌ను అనుపమ తన కెరీర్‌లోనే తొలిసారిగా పోషించిందని చెప్పారు. లిల్లీతో టిల్లు ప్రయాణం కూడా విభిన్నంగా ఉంటుందని అన్నారు. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకుడు.